క్లుప్తంగా

వెండి తాపడం తయారీకి రూ.10 వేలు విరాళం



పెనుగంచిప్రోలు: గ్రామంలో ఉన్న శ్రీతిరుపతమ్మ వారి ఆలయంలోని అంకమ్మ వారి ఉపాలయం గోపురం వెండి తాపడం తయారీకి సోమవారం జగ్గయ్యపేట మండలం గండ్రాయి గ్రామానికి చెందిన మన్నెం వెంకట రాఘవరావు రూ.10 వేలు విరాళం ఆలయ చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు చేతుల మీదుగా అందజేశారు. ఈసందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

అన్నదానానికి రూ.50 వేల విరాళం



పెనుగంచిప్రోలు: గ్రామంలో ఉన్న శ్రీతిరుపతమ్మ వారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి సోమవారం తెలంగాణ రాష్ట్రం, ఖమ్మం జిల్లా, వైరా మండలం, ముసలిమడుగు గ్రామానికి చెందిన నర్వనేని వినీల కుటుంబసభ్యులు రూ.50,116 ఆలయ చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

రైతు భరోసా కోసం దరఖాస్తు చేసుకోవాలి

వత్సవాయి: వైఎస్సార్ రైతుభరోసా కోసం అర్హత ఉన్న రైతులు దరఖాస్తులు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి వి.రవికుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023 సంవత్సరానికి గాను దరఖాస్తులు తీసుకుంటున్నారని, పట్టాదారు పాసు పుస్తకం, 1బీ, ఆధార్, బ్యాంకు అకౌంట్ జిరాక్స్ కాపీలను తీసుకుని గ్రామాలలోని రైతుభరోసా కేంద్రాలలో దరఖాస్తులు ఇవ్వాలని పేర్కొన్నారు. గత సంవత్సరంలో రైతుభరోసా వచ్చిన వారు కొత్తగా దరఖాస్తులు ఇవ్వాల్సిన అవసరం లేదని చెప్పారు. గతంలో రానివారు. ప్రస్తుతం కొత్తగా అర్హత పొందినవారు దరఖాస్తులు అందించాలని సూచించారు.

ఆర్డీఓ స్పందనలో 10 అర్జీలు

నందిగామ: పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. డివిజన్ పరిధిలోని పలు మండలాలకు చెందినవారు పది అర్జీలను అందజేశారని కార్యాలయ ఏవో రాజ్‌కుమార్ తెలిపారు. రెవెన్యూ డిపార్ట్ మెంట్ సమస్యలకు సంబంధించి నాలుగు, సర్వే డిపార్ట్‌మెంట్‌కు సంబంధించి రెండు, హౌసింగ్ డిపార్ట్‌మెంట్‌కు సంబంధించి రెండు, మెడికల్ డిపార్ట్‌మెంట్‌కు సంబంధించి ఒకటి, ఇరిగేషన్ డిపార్ట్ మెంట్‌కు సంబంధించి ఒకటి అర్జీలు అందాయన్నారు.

కంచికచర్లలో నాలుగు అర్జీలు

కంచికచర్ల: ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందనలో పలు గ్రామాల నుంచి సమస్యల పరిష్కారం కోరుతూ నాలుగు అర్జీలు వచ్చాయని తహసీల్దార్ వడ్డేశ్వరపు రాజకుమారి ఆదివారం తెలిపారు. మండలంలోని పరిటాల గ్రామంలో భూములను రీ సర్వే చేయగా విస్తీర్ణంలో మార్పులు వచ్చాయని వాటిని సరి చేయాలని రెండు అర్జీలు, కంచికచర్లలో డ్రైనేజీలో మురుగునీరు పారుదల కావటం లేదని మరో రెండు అర్జీలు వచ్చాయన్నారు.

వీరులపాడులో...

వీరులపాడు: స్పందనకు వచ్చే అర్జీలను పరిశీలించి తక్షణం పరిష్కరిస్తామని తహసీల్దార్ ఆశయ్య నాయక్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఆయన స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పందనకు ప్రజల నుంచి నాలుగు అర్జీలు అందాయన్నారు. వాటి ని పరిశీలించి ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరించనున్నట్లు తెలిపారు. డెప్యూటీ తహసీల్దార్ ఆంజనేయులు, ఆర్ఐ శివప్రసాద్, పలువురు వీఆర్వోలు పాల్గొన్నారు.

నేడు కంచికచర్లలో జిల్లా స్థాయి భూ పరీక్ష

కంచికచర్ల: కంచికచర్ల రైతు భరోసా కేంద్రం -1లో ఈనెల 11వ తేదీ ఉదయం 10.30 గంటల నుంచి జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో భూ పరీక్ష శిక్షణా వారంపై వర్క్‌షాపు నిర్వహించనున్నట్టు మండల వ్యవసాయ అధికారి కె.విజయకుమార్ సోమవారం తెలిపారు. ఈ శిక్షణా వారం కార్యశాలకు ఎన్టీఆర్ జిల్లాలోని 17 మండలాల వ్యవసాయ అధికారులు, డివిజనల్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఐదుగురు, 17 మంది మాస్టర్ ట్రైనర్ గ్రామ వ్యవసాయ సహాయ సంచాలకులు పాల్గొంటారన్నారు. ముందుగా శిక్షణ శిబిరాన్ని జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.నాగమణి ప్రారంభిస్తారన్నారు. కృషి విజ్ఞాన్ కేంద్రం గరికపాడు శాస్త్రవేత్తలు, జిల్లా వనరుల కేంద్రం, జిల్లా భూసార పరీక్షా కేంద్ర అధికారులు సాంకేతిక పరమైన శిక్షణను అందిస్తారని ఏఓ తెలిపారు.

సీఎం జగన్‌తోనే సుస్థిర పాలన

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఉదయభాను
- వార్డుల్లో ఉత్సాహంగా జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం
- ఇంటింటా హారతులు పట్టిన మహిళలు



పేటలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో పాల్గొని ప్రశ్నల పుస్తకంలో ప్రజల అభిప్రాయాలను నమోదు చేస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలో సుస్థిర పాలన ఏర్పడుతుందని, తద్వారా భవిష్యత్ తరాలకు భరోసా కలుగుతుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. పట్టణంలోని 7 వ సచివాలయం పరిధిలోని 18 వ వార్డు ఎర్రయ్య గారి బజారులో సోమవారం జగనన్నే మా భవిష్యత్– మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఉదయభాను స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ పర్యటించారు. మహిళలు హారతులు పట్టి ఆశీర్వదించారు. ప్రస్తుత పాలనలో సంతోషంగా ఉన్నామని, పథకాలన్నీ అందుతున్నాయని చెప్పారు. ఉదయభాను మాట్లాడుతూ భావి తరాలకు భరోసాగా, జగనన్న ఉన్నారనే ధైర్యాన్ని కల్పించే దిశగా ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. గత పాలనలో బడుగు, బలహీన వర్గాలు అట్టడుగు స్థాయిలో ఉండేవన్నారు. అటువంటి వారి జీవితాల్లో వెలుగులు నింపిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. పేద, మధ్య తరగతి వర్గాల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉండటంతో ఎక్కడకు వెళ్లినా అపూర్వ స్వాగతం లభిస్తోందన్నారు. సంక్షేమ రాష్ట్రంగా నిలబెట్టేందుకు పాటుపడుతున్న జగనన్నను మరొక సారి ముఖ్యమంత్రిని చేసేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. గృహసారథులతో కలిసి ప్రతి ఇంటికీ వెళ్లి 15 నిమిషాలు గడిపి పథకాలు, వలంటీర్ల పనితీరు తదితర అంశాలపై ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్నారు. అనంతరం వారి సమ్మతితో గోడలకు



పెనుగంచిప్రోలు మండలం ముచ్చింతాలలో పాల్గొన్న జెడ్పీటీసీ నాగమణి తదితరులు



పెండ్యాలలో ప్రభుత్వ పథకాలను వివరించి కరపత్రం పంచుతున్న ఎంపీపీ మలక్ బషీర్

స్టిక్కర్లను అతికించారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా సంక్షేమ పథకాలను అందజేస్తూ జనరంజక పాలన సాగిస్తున్నారని, సచివాలయ వ్యవస్థను ఏర్పాటుచేసి ప్రజల వద్దకు పాలనను తీసుకువచ్చినట్లు తెలిపారు. రాష్ట్ర భవిష్యత్ కోసం వైఎస్సార్ సీపీకే మరొక అవకాశం ఇవ్వాలని కోరారు. ప్రతిపక్షాలు ఎన్ని కుతంత్రాలు పన్నినా నమ్మవద్దని సూచించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, పట్టణ సచివాలయాల కన్వీనర్ తుమ్మేపల్లి నరేంద్ర, పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు ఆవాల భవానీప్రసాద్, పట్టణ మహిళా అధ్యక్షురాలు ముసిని రాజ్యలక్ష్మి, ఎస్టీ విభాగం అధ్యక్షుడు బద్దూనాయక్, మాజీ కౌన్సిలర్ జాన్‌బాషా, ఏఎంసీ డైరెక్టర్ గోలి రామేశ్వరి, సచివాలయ కన్వీనర్ రంగిశెట్టి శ్రీరంగమ్మ, గృహ సారథులు షేక్ సైదులు, గునిశెట్టి రమేష్, కొండ నాగ, పిల్లలమర్రి లక్ష్మీనారాయణ, అంజి తదితరులు పాల్గొన్నారు.

వీరులపాడులో...

వీరులపాడు: మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని సచివాలయ కన్వీనర్‌లు, గృహ సారథులు ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు. వీరులపాడు గ్రా మంలో నిర్వహిస్తున్న మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని సోమవారం జెడ్పీటీసీ మాజీ సభ్యు డు కోటేరు ముత్తారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి నాలుగేళ్లలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పథకాలు, చేస్తున్న మంచిని ప్రజలకు వివరించాలన్నారు. గృహ యజమానుల అనుమతితో ఇంటి గోడలకు, ఫోన్‌లకు స్టిక్కర్ అంటించాలని సూచించారు. ప్రజా మద్దతు పుస్తకంలోని ప్రశ్నలకు ప్రజల నుంచి అభిప్రాయా లు సేకరించాలని తెలిపారు. మండలంలోని చెన్నారావుపాలెం గ్రామంలో గృహ సారథులు, సచివాలయ కన్వీనర్‌లు మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యకరమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అన్ని వర్గాల బలోపేతానికే సంక్షేమ పథకాలు

పెనుగంచిప్రోలు: అన్ని వర్గాల ప్రజలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్...మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో కుటుంబ సభ్యులతో మమేకమై గత ప్రభుత్వానికి, జగనన్న ప్రభుత్వానికి గల తేడాను వివరించటంతో పాటు వారి నుంచి ప్రభుత్వ పాలనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ముచ్చింతాలలో జరిగిన కార్యక్రమంలో మైనింగ్, పూసల కార్పొరేషన్ డైరెక్టర్‌లు బత్తుల రామారావు, పూసల చేని కుమారి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వూట్ల నాగేశ్వరరావు, సచివాలయాల మండల కన్వీనర్ కన్నమాల శామ్యూల్, గ్రామ పార్టీ నాయకులు మల్లెంపాటి జయరామ్, జి.వడ్డీకాసులు, సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు పాల్గొన్నారు. పెనుగంచిప్రోలులో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, అనిగండ్లపాడులో సర్పంచ్ జ్యోతిబ్రహ్మం, ముండ్లపాడులో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు గుంటుపల్లి వాసు, సొసైటీ అధ్యక్షులు గూడపాటి రవికుమార్ పాల్గొన్నారు.

మురుగునీటి పారుదలకు చర్యలు

కంచికచర్ల: మండలంలోని పలు గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్–మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం సోమవారం జరిగింది. మండలంలోని పెండ్యాలలో ఎంపీపీ షేక్ మలక్‌బషీర్, కీసరలో జెడ్పీటీసీ సభ్యురాలు వేల్పుల ప్రశాంతి, సర్పంచి పేరం నర్సమ్మ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. కంచికచర్లలో వైఎస్సార్‌సీపీ మండల, పట్టణ కన్వీనర్లు నన్నపనేని నరసింహారావు, వేమా సురేష్ బాబు, సర్పంచ్ వేల్పుల సునీత ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లో ప్రతి ఇంటికీ వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఇంటి తలుపులపై యజమానుల అనుమతితో సీఎం జగన్ స్టిక్కర్లను అతికించారు. కంచికచర్ల వసంత కాలనీలో మా నమ్మకం నీవే జగన్ కార్యక్రమం నిర్వహిస్తుండగా కాలనీవాసులు పలు సమస్యలు వారికి విన్నవించారు. డ్రైనేజీల ద్వారా మురుగునీరు పారుదల కాక రోడ్డుపై నిల్వ ఉంటున్నాయని తెలిపారు. స్పందించిన వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు సురేష్ బాబు అప్పటికప్పుడే జేసీబీని తీసుకువచ్చి మురుగునీరు కాల్వ ద్వారా పారుదల అయ్యేలా చొరవ తీసుకున్నారు. దీంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు దేవరకొండ గురవయ్య, నారిశెట్టి శ్రీనివాసరావు, పరిటాల రాము, ఎంపీటీసీ సభ్యులు వేమా రోజారమణి, మాడుగుల మధుబాబు, పాపట్ల సీత తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో నీటి ఎద్దడి నివారణకు చర్యలు

అధికారులకు ఎమ్మెల్యే జగన్‌మోహనరావు ఆదేశం



కంచికచర్లలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

కంచికచర్ల: ప్రజా ప్రతినిధులు, నాయకులు, అధికారులు సమన్వయంతో పనిచేసి వేసవికాలంలో నీటి ఎద్దడి లేకుండా చూడాలని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. కంచికచర్ల గ్రామ సచివాలయం -1లో సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వార్డు సభ్యులు, అధికారులతో కలసి సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో కృష్ణానది, మున్నేరు, వైరా ఉపనదులు ఉన్నాయని, వాటి ద్వారా రక్షిత మంచినీటి సరఫరా, పైలెట్ ప్రాజెక్టుల ద్వారా అన్ని గ్రామాలకు తాగునీటిని సరఫరా చేయాలన్నారు. ఒకవేళ పైపులు లీకయితే తక్షణమే అధికారులు స్పందించి పైప్‌లైన్లకు మరమ్మతు పనులు తక్షణమే చేయించాలన్నారు. తాగునీరు సరఫరా కాని ఎగువ ప్రాంతాల్లో నివసించే ప్రజలకు వాటర్ ట్యాంకర్ల ద్వారా మంచినీరు సరఫరా చేయాలన్నారు. వేసవి కాలంలో ఏ గ్రామంలో కూడా తాగునీటి ఎద్దడి సమస్య లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. మండలంలోని చెవిటికల్లు గ్రామంలో కృష్ణానదిపై కంచికచర్ల, బత్తినపాడు పైలెట్ ప్రాజెక్టులు రెండు ఉన్నాయని, వాటి ద్వారా కంచికచర్ల మండలంలోని పలు గ్రామాలు, వీరులపాడు మండలంలోని పలు గ్రామాలకు తాగునీరు సరఫరా అవుతుందన్నారు. మండలంలోని కీసర మున్నేరు వద్ద ఉన్న రక్షిత మంచినీటి పథకాల ద్వారా కూడా తాగునీరు సరఫరా అవుతున్నాయని వాటి ప్రధాన పైప్‌లైన్లు మరమ్మతులకు గురయితే తక్షణమే పనులు చేయించాలన్నారు. అనంతరం కంచికచర్ల పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతి గూర్చి అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ షేక్ మలక్‌బషీర్, జెడ్పీటీసీ సభ్యురాలు వేల్పుల ప్రశాంతి, సర్పంచి వేల్పుల సునీత, ఉపసర్పంచి వేమా సురేష్‌బాబు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నన్నపనేని నరసింహారావు, ఎంపీటీసీ సభ్యులు మాడుగుల మధుబాబు, వేమా రోజారమణి, పంచాయతీ కార్యదర్శి కనగాల రవి కుమార్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

చేయి పట్టుకుని నడిపిస్తున్న నాయకుడు జగన్

గడపగడపలో ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



వెలదికొత్తపాలెంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేయి పట్టుకుని మాటివ్వటమే కాదు ఆ చేయి పట్టుకుని నడిపిస్తున్న నాయకుడని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. చందర్లపాడు మండలం వెలదికొత్తపాలెం గ్రామంలో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా గ్రామంలోని ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించి సంక్షేమ పథకాల క్యాలెండర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలను అందిస్తూ వారి జీవితాలలో కొత్త వెలుగులు నింపుతున్నారన్నారు. రాష్ట్ర చరిత్రలో బీసీలను బ్యాక్‌బోన్ క్లాస్‌గా గుర్తించి వారికి రాజకీయాలలో కొత్త పదవులు కట్టబెట్టి కొత్త చరిత్ర సృష్టించారని తెలిపారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజలకు మంచి చేయాలనే తపనతో పని చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి రానున్న ఎన్నికల్లో సైతం అండగా ఉండి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గ్రామ కన్వీనర్ చింతోటి వీర ప్రసాద్, ఎంపీటీసీ సభ్యురాలు గుడేటి నాగమల్లేశ్వరి, నాయకులు కొల్లి హనుమంతరావు, వంకాయలపాటి భాను, పృథ్వీరావు, సత్యనారాయణ, పతకమూరి అనిల్‌కుమార్, కంతేటి త్రినిల్, నల్లాని అంకమ్మరావు, వలంటీర్‌లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పవళింపు సేవతో ముగిసిన బ్రహ్మోత్సవాలు



అద్దాల మేడలో పవళింపు సేవ నిర్వహిస్తున్న అర్చకులు

తిరుమలగిరి(జగ్గయ్యపేట): ప్రముఖ పుణ్యక్షేత్రం వాల్మీకోద్భవ వెంకటేశ్వర స్వామి వారి కల్యాణ మహోత్సవాలు సోమవారం రాత్రి పవళింపు సేవతో ఘనంగా ముగిశాయి. అర్చకులు తిరునగరి రామకృష్ణమాచార్యులు, పరాంకుశం వాసుదేవాచార్యుల పర్యవేక్షణలో స్వామి వారికి కలశ స్నాపన, అశ్వవాహనోత్సవం, చోరసంవాదం, మహానివేదన, పవళింపు సేవ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆరు రోజుల పాటు బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించినట్లు ఆలయ ఏసీ దాసరి శ్రీరామవరప్రసాదరావు తెలిపారు. స్వామి వారి ఉత్సవమూర్తులను ఆలయం నుంచి ఊరేగింపుగా తీసుకువచ్చి అద్దాల మండపం ప్రాంగణంలో ఉత్సవ మూర్తులను ఉంచి పవళింపు సేవ నిర్వహించారు. మహిళలకు ఆలయ సంప్రదాయం ప్రకారం పసుపు, కుంకుమ, జాకెట్ ముక్కలు, ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సుబ్రహ్మణ్యం, సూపరింటెండెంట్ శోభనాద్రి, పాలకవర్గ సభ్యులు శ్రీనివాసరావు, జయ, పార్వతి, లక్ష్మి, ఉషారాణి, వెంకటేశ్వర్లు, బేబి, నాగయ్య, ఆలయ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలకు చరమగీతం

జగ్గయ్యపేట అర్బన్: దేశంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు చరమగీతం పాడాల్సిన అవసరం ఏర్పడిందని సీపీఐ జిల్లా డెప్యూటీ కార్యదర్శి దోనెపూడి శంకర్ అన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో సోమవారం పార్టీ శ్రేణులతో నిర్వహించిన ముఖ్య సమావేశంలో కేంద్ర ప్రభుత్వం తన ప్రజా వ్యతిరేక విధానాలతో ప్రజలను ఏ విధంగా మోసగిస్తుందో వివరించారు. ఈనెల 12న స్థానిక పార్టీ కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం జరుగుతుందని, 14 న పార్టీల రాజకీయ ప్రచార యాత్ర, 28 న ప్రచారయాత్రకు సంబంధించిన బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు నీలకంఠం శివప్రసాద్, సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి శివాజి, పట్టణ కార్యదర్శి జె.శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శులు మాశెట్టి రమేష్‌బాబు, అసదుల్లా, ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ పోతిపాక వెంకటేశ్వర్లు, బిల్డింగ్ వర్కర్స్ నాయకులు కర్ల జోజి, భోగ్యం నాగులు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నేత మస్తాన్, గ్యాస్ కంపెనీ యూనియన్ ప్రతినిధి యేసు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు లంక గోవింద రాజులు, పట్టణ అధ్యక్షుడు భాను పాల్గొన్నారు.

నేడు పూలే విగ్రహాల ఆవిష్కరణ

విస్సన్నపేట: స్థానిక రెడ్డిగూడెం రోడ్డులో గ్రామ సచివాలయం పక్కన నూతనంగా ఏర్పాటు చేసిన మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రీ బాయిపూలే విగ్రహాలను ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి మంగళవారం సాయంత్రం నాలుగు గంటలకు ఆవిష్కరిస్తారు. బహుజన దళిత ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుంది.

జగనన్నపై నమ్మకంతోనే భారీగా చేరికలు

ప్రభుత్వ విప్ ఉదయభాను



వైఎస్సార్ సీపీలో చేరిన వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను

జగ్గయ్యపేటఅర్బన్: పార్టీలు, వర్గాలు, కులాలకు అతీతంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పాలనతో రాష్ట్ర భవితవ్యంపై ఏర్పడిన నమ్మకం, భరోసా కారణంగానే వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీలోకి పెద్ద సంఖ్యలో వచ్చి చేరుతున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. సోమవారం ఉదయభాను నివాసంలో జరిగిన కార్యక్రమంలో వత్సవాయి మండలం, దేచుపాలెం గ్రామానికి చెందిన 8 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన సర్వేపల్లి కృష్ణ, గోపాలరావు, తేజ, ప్రభుదాసు, గోపి, జయరాజు, శ్రీనులకు పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బొల్లా నారాయణప్రసాద్, వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట మండల అధ్యక్షుడు మండవ శ్రీనివాసగౌడ్, దేచుపాలెం గ్రామ అధ్యక్షుడు పతకమూడి నాగేశ్వరరావు, బుల్లియ్య తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతతో ప్రమాదాల నివారణ

విద్యుత్ వినియోగంలో జాగ్రత్తలు తప్పనిసరి



పెనుగంచిప్రోలు విద్యుత్ సబ్‌స్టేషన్

పెనుగంచిప్రోలు: రోజువారీ జీవితంలో విద్యుత్ ఎంత అవసరమో, ఆదమరిస్తే అంతకన్నా ఎక్కువ ప్రమాదాలే జరుగుతుంటాయి. రోజురోజుకీ పెరుగుతున్న వినియోగంతో పాటు ప్రమాదాల సంఖ్య కూడా పెరుగుతూనే ఉంది. వేసవిలో పెరిగిన ఉష్ణోగ్రతలకు అనుగుణంగా విద్యుత్ వినియోగం అధికమైంది. గృహోపకరణాలు, వైరింగ్‌లో లోపాలు, విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులు కారణంగా వినియోగదారులకు తెలియకుండానే నష్టం జరుగుతోంది. చిన్నవే కదా అని ఆదమరిస్తే ఊహించని రీతిలో నష్టపోవాల్సి వస్తుంది.

నాసిరకం వైర్లతో ప్రమాదాలు

విద్యుత్ వినియోగం, భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలి. విద్యుత్ ఉపకరణాల మరమ్మతులు, వైర్లు సరిచేయటం వంటి పనులు సొంతంగా చేయటం మంచి పద్ధతి కాదు. పైగా ధరల విషయంలో వెనకడుగు వేసి నాసి రకం ఉపకరణాలు, వైర్లు తీసుకుంటే ప్రమాదాలను కొని తెచ్చుకున్నట్లే . వేసవిలో మరింత అప్రమత్తంగా ఉండాలి. తీగలు వేడెక్కే అవకాశం ఉండటంతో ఈ సమయంలో ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉంటుంది. ప్రధానంగా ఇంటికి వాడే విద్యుత్ తీగలు, పరికరాలు ఐఎస్ఐ మార్క్‌వి మాత్రమే వినియోగించాలి. విద్యుత్ లోడ్ అంతా ఒకే ఫ్యూజ్‌పై పడకుండా చూసుకోవటం మంచిది. విద్యుత్ వినియోగించే ఉపకరణాలు బట్టి తగిన సామర్థ్యం ఉన్న తీగలు, పరికరాలు వినియోగించాలి. ఇళ్లల్లో లోడ్ సర్క్యూట్ బ్రేకర్లు వేసుకుంటే అధిక లోడ్ వచ్చినప్పుడు ట్రిప్ చేసి ప్రమాదాన్ని హెచ్చరిస్తాయి. మండలంలో గృహ విద్యుత్ కనెక్షన్లు 15,200 ఉండగా, వ్యవసాయ కనెక్షన్లు 2,130 ఉన్నాయి.

అవగాహన లేకనే...

ఇళ్లల్లో పాత వైరింగ్ ప్రమాదకరంగా ఉంటే కొత్త వైరింగ్ చేయించుకోవాలి. విద్యుత్ పనుల్లో తర్ఫీదు పొందిన ఎలక్ట్రీషియన్ చేతనే వైరింగ్ చేయించుకోవాలి. సరైన ఎర్త్ లేకపోతే విద్యుత్ ఉపకరణాలు దెబ్బతినే ప్రమాదం ఉంది. ఒకేచోట ఎక్కువ ప్లగ్‌లు వినియోగించటం వలన కూడా ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది.

–పూర్ణచంద్రరావు, విద్యుత్ ఏఈ, పెనుగంచిప్రోలు

ఉనికిని చాటుకోవడం కోసమే...

ప్రభుత్వ విప్ ఉదయభాను



జగ్గయ్యపేట అర్బన్: పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు, అభివృద్ధితో పాటు ప్రజలతో మమేకమయ్యే కార్యక్రమాలతో ప్రజల హృదయాలలో చెరగని ముద్ర వేసుకుంటున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూసి ఉనికి కోల్పోతున్న చంద్రబాబు మతి భ్రమించి తప్పుడు ఉద్యమాలకు పాల్పడుతున్నాడని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. రాష్ట్రంలో విద్యుత్ చార్జీలు పెంచకముందే పెంచినట్లుగా ప్రజలను మభ్యపెడుతూ నిరసనలు చేపడుతున్న టీడీపీ తీరుపై ఎమ్మెల్యే ఉదయభాను మండిపడ్డారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ వారు విద్యుత్ చార్జీల పెంపుపై నిరసన కార్యక్రమాలను చేపట్టడాన్ని తీవ్రంగా ఖండించారు. రోజురోజుకు ప్రజల విశ్వాసాన్ని కోల్పోతున్న చంద్రబాబు జగన్‌మోహన్‌రెడ్డిని చూసి అసహనం కోల్పోతూ తన ఉనికి కాపాడుకోవడం కోసం తప్పుడు కార్యక్రమాలను, ఉద్యమాలను చేపట్టి ప్రజలను పక్క దారి పట్టిస్తున్నాడని విమర్శించారు. ఇది ఆయన రాజకీయ దిగజారుడుతనానికి పరాకాష్ట అన్నారు. గతంలో తాను ముఖ్యమంత్రిగా ఉన్నపుడు చంద్రబాబు విద్యుత్ చార్జీలు పెంచగా, ఉద్యమం చేస్తున్న ప్రజలను బషీర్‌బాగ్‌లో దాడులు చేయించి ఉక్కుపాదంతో అణచివేసిన సంఘటనలు రాష్ట్ర ప్రజలెవరూ మరచిపోలేదన్నారు. అటువంటి చంద్రబాబు ఇప్పుడు గురివింద గింజ సామెత వలే ప్రవర్తిస్తూ తప్పుడు ఉద్యమాలు చేస్తూ ప్రజలను గందరగోళానికి గురిచేస్తున్నాడని, ఆయన్ను చూసి ప్రజలు అసహ్యించుకుంటున్నారని తెలిపారు. చంద్రబాబుకు సరైన సమయంలో, సరైన విధంగా తగిన గుణపాఠం చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

ఘనంగా సుబ్రహ్మణ్యేశ్వరుని శాంతి కల్యాణం



శాంతి కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

నందిగామ: మండలంలోని దాములూరు కూడలి వద్ద గల సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయంలో సోమవారం స్వామివారి శాంతి కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవంలో భాగంగా వేకువజామునే స్వామి వారికి విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు దాములూరి శ్రీనివాస శర్మ, యనమదల సాయి శర్మ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి శాంతి కల్యాణ మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. అనేకమంది దంపతులు పీటలపై కూర్చొని స్వామివారి కల్యాణాన్ని నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది. ఆయా కార్యక్రమాలలో పలు గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

శివాలయాన్ని సందర్శించిన విశ్రాంత స్థపతి సుందరరాజన్

నందిగామ: ఉభయ తెలుగు రాష్ట్రాల దేవదాయ శాఖ విశ్రాంత స్థపతి ఎస్.సుందరరాజన్ సోమవారం నందిగామ రామలింగేశ్వర స్వామి వారి ఆలయానికి వచ్చారు. హైదరాబాదు నుంచి చెన్నైకి వెళ్తూ నందిగామ ఆలయ ఈవో సుబ్రహ్మణ్యం ఆహ్వానం మేరకు విచ్చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించడంతోపాటు ఆలయానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో ఆలయ వంశపారంపర్య ధర్మకర్త వాసిరెడ్డి మురళి రాఘవ కుమార్, సుధీర్, ఆలయ అర్చకుడు బాలా శర్మ పాల్గొన్నారు.